ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని వినతి



రాజేంద్రనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని శనివారం ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పాఠశాలలో మరమ్మతులు నిర్వహించి వారికి చదువుకునేందుకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని కోరామన్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, బిటూకూరి సిద్దేశ్వర్, కొంగళ్ల బుచ్చయ్య తదితరులున్నారు.

ప్రారంభమైన అఖిల భారత సంగీత బైఠక్



బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని శారదాధామంలో అఖిల భారత సంగీత సమావేశాలు ప్రారంభమయ్యాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విద్యాభారతి సంగీత ప్రముఖులు శనివారం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు, విశ్రాంత ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తక్కెళ్లపల్లి తిరుపతి రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీత సాధనతో మన మహర్షులు ఎన్నో అద్భుతాలు సృష్టించారన్నారు. సంగీతం ద్వారా అనేక రుగ్మతులను నివారించవచ్చని కూడా కనుగొన్నారన్నారు. విద్యాభారతి శిశువులోని శివ శక్తిని బయటకు తీసేందుకు సంగీతాన్ని ఓ అంశంగా తీసుకుని జాతీయ భావం నిర్మాణంలో విశేష కృషి చేస్తోందన్నారు. సరస్వతీ విద్యా పీఠం తెలంగాణ సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, విద్యా భారతి అధికారులు, వివిధ రాష్ట్రాల నుంచి 57 మంది సంగీత ప్రముఖులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్

రాజేంద్రనగర్: ఈవీఎం గోదాంను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ వివిధ పార్టీల నాయకులతో కలిసి సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లాకు చెందిన నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరుస్తున్నారు. కొత్తగా 9వేల ఈవీఎంలు శనివారం ఉదయం గోదాము వద్దకు రాగా వాటిని వివిధ పార్టీల నాయకుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.



లైన్‌మెన్‌ను దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

- రూ.78వేల బకాయిలు చెల్లించనందుకు కనెక్షన్ తొలగింపు

మణికొండ: విద్యుత్ కనెక్షన్‌ను తొలగించిన సహాయ లైన్‌మెన్‌ను దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన పుప్పాల్‌గూడ ఫ్రెండ్స్ కాలనీలో జరిగింది. విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... పుప్పాలగూడకు చెందిన అక్రమ్‌కు మూడు చోట్ల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. కాగా వాటికి సంబంధించిన నెలవారి బిల్లులు చెల్లించకపోవడంతో రూ.78వేల వరకు బకాయిలు ఉన్నాయి. ఈ విషయాన్ని జూనియర్ లైన్‌మెన్ మహేందర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు విద్యుత్ కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. దీంతో కనెక్షన్ తొలగించటంతో అతడు ఆగ్రహంతో బూతుపదజాలంతో దూషించాడు. మనస్థాపం చెందిన జూనియర్ లైన్‌మెన్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వాలి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఐటీ, సేవా సంస్థలు తమ వంతు చేయూతనందించాల్సిన అవసరం ఉందని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట్ కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. కోకాపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఫ్రాంక్లిన్ సంస్థ సహకారంతో రౌండ్ టేబుల్ ఇండియా ప్రాజెక్టు నిర్మిస్తున్న రెండు అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ బ్లాక్ పనులను ఆయా సంస్థల ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎస్ఆర్‌లో భాగంగా ఐటీ సంస్థలు తమ నిధులను స్థానికంగా ఖర్చుచేస్తే పాఠశాలల రూపురేఖలను మార్చవచ్చన్నారు. దీనికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఫ్రాంక్లిన్ సంస్థ సీఎస్ఆర్ కో–ఆర్డినేటర్ లక్ష్మి, రౌండ్ టేబుల్ సంస్థ సీఈఓ నిర్మల్, కో–ఆర్డినేటర్ నితిన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్. అనిల్‌కుమార్, సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకుని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సురక్ష, సాయి యాదాద్రి ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తున్నానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, అశోక్, కల్పన, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు రిజల్ట్ టాక్..

శంషాబాద్ రూరల్: ఈ లర్నింగ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా మండలంలోని నర్ఖూడ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం 'రిజల్ట్ ఎడ్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్' ఆధ్వర్యంలో 'రిజల్ట్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించారు.

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.
- ఫుడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహణకు సరైన ప్రణాళిక ఏర్పాటుతో పేదల ఆకలి తీర్చవచ్చని స్పష్టం చేశారు.పదో తరగతి విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ సెషన్‌ను నిర్వహించారు. ప్రతినిధులు ఆకాష్‌రావు, విశ్వాస్, యశ్వంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పనులు ప్రారంభం

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండలో గ్రామీణ క్రీడా మైదానం పనులను సర్పంచ్ గుర్రం పద్మావతి ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఈ స్థలంలో మైదానం ఏర్పాటుతో గ్రామస్తులతో పాటు విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని శనివారం సర్పంచ్ పద్మావతి తెలిపారు. సమీపంలో ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. ఉపసర్పంచ్ భిక్షపతి, సొసైటీ డైరెక్టర్ గుర్రం అనంత్‌రెడ్డి, వార్డు సభ్యులు గౌతంబాబు, లక్ష్మి, అరుంధతి, అమృత, అనుసూజ, సురేష్, బాల్‌రాజ్, రాఘవేందర్‌గౌడ్, మల్లేష్, స్థానికులు వీరయ్య, నర్సింహారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయురాలు దమయంతి తదితరులున్నారు.

ఉత్తర ద్వార దర్శనం

మణికొండ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా గండిపేట్ మండల పరిధిలోని వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 2 సోమవారం రోజున నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, పుప్పాల్‌గూడ గోల్డెన్ టెంపుల్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ఓయూ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తుల దర్శనాలకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. మంచిరేవుల సహా మండల పరిధిలోని దేవాలయాల్లో ఉదయం 4గంటలకు స్వామి వారికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి 5గంటలకు స్వామి వారి శేషవాహన సేవ నిర్వహించి ఉదయం 5.30గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభిస్తామని అర్చకులు ప్రకటించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకోవాలని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని అర్చకులు కోరారు.



పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని సందడిగా గడిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్‌లోని ఢిల్లీ బచ్‌పన్ స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరి, లక్ష్మిజోషి, హేమా, మీనాక్షి, భారతి, కులదీప్‌కౌర్, పూజాశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ప్రమాదభరితంగా మ్యాన్‌హోల్స్!

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదభరితంగా మ్యాన్‌హోల్స్ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్, కాటేదాన్, ఉడ్డెంగడ్డ, లక్ష్మిగూడ, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌తో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో రహదారులపై వాహనదారులు, పాదాచారులు ప్రయాణించాలంటే భయపడుతున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని దీనిపై అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పొరేటర్ పర్యటన

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్ష్మిగూడ మల్లికార్జున కాలనీలో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, తదితర సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోజూ కాలనీలు, బస్తీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తామన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, శివ, మదస్ తివారీ, సాంబశివ, ఓం ప్రకాష్‌సింగ్, అధికారులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు



రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అంజనీకుమార్‌ను శంషాబాద్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
– శంషాబాద్























